# దిక్కు మారిన కథ

ఎమ్.వి.ఎస్. హరనాథరావు

## ఓ వెర్రికేక...

**శవం వాయించిన వీణలా!**
**రాక్షసుడి తాళంలా!**
**నెత్తురు పాడిన పాటలా!**

ఓ వెర్రికేక... ఆర్తనాదం... కన్నీళ్లగోల... గుండె వరాల చప్పుడు-

ఆ చిన్న డాబా యింట్లో... ఆ మూల గదిలో నిస్సహాయమైన స్థితిలో

భర్తను బ్రతిమలాడుతోంది... ఓ భార్య

అత్తను ప్రాధేయ పడుతోంది ఓ ఇల్లాలు.

తనను తగలబెట్టవద్దని అందని వాళ్ళ పాదాలను పట్టుకొని ఏడుస్తోంది ఓ ఆడది.

ఆ ఆడది ఆ మొగాడ్ని ఐదేళ్ళ క్రితం పెళ్ళి చేసుకుంది. ఆ మొగాడి మొగతనాన్ని 20 వేలు పోసి కొన్నాడు ఆ ఆడదాని తండ్రి. ఈ అయిదు ఏళ్ళ కాపురంలో ఆ ఆడది పేరు మార్చుకుని భార్యగా మారింది. మారిన నేరానికి ఆమెను హింసించడం తన మొగతనానికి నిదర్శనంగా పెట్టుకున్నాడు భర్త. ఒక అర్ధరాత్రి ఆమె తొడల మీద సిగరెట్టు పెట్టి కాల్చాడు. ఇంకో పట్టపగలు బ్లేడుతో ఆమె బుగ్గలు గీకాడు. మరో అసుర సంధ్య వేళ ఆమె జుత్తును కత్తిపీటతో కోశాడు. అత్తగారు కోడలి కన్నీళ్ళను చూసింది. తనూ ఆడదే అని మర్చిపోయింది. కాబట్టి కొడుకు చేసిన పనులు ఎన్నడూ కాదనలేదు. కాలిన మచ్చలు పడిన గాయాలు వొంటి మీదపడిన దెబ్బలు అన్నీ లెక్క వేసిన అత్తగారు మరో లెక్క చెప్పింది.

"మీ అయ్య బాకీపడ్డ కట్నం ఇంకా పది వేలు వుంది. ఆ సొమ్ము జమ పడే వరకు ఆ సొమ్ము లెక్కలు నీ వొంటి మీద నా కొడుకు యిట్లానే సిగరెట్లతో, బ్లేడ్లతో రాస్తాడే" అని-

కోడలికి ఒక్కసారి తండ్రి మనసులో మెదిలాడు-

కుచేలుడి ఇంట్లో పని మనిషిలా కనిపించాడు.

ఎండిన ఎముకలు ఎవరైనా కొంటారా, అని అడిగే అమాయకుడిలా కనిపించాడు.

తండ్రి దగ్గర దరిద్రం తప్ప మరే ఆస్తి లేదు.

ఆకలి తప్ప మరో బ్యాంకు బేలన్సు లేదు-

కూతురి కాపురం గురించి ఆందోళన, దిగులూ తప్ప మరే వుద్యోగం లేదు.

ఆ తండ్రి పది వేలు ఎలా ఇవ్వగలడు???

కానీ భర్తకు తన మావగారు అలా కనిపించలేదు-

రిజర్వు బ్యాంకుకు మావగారు అప్పు పెట్టినట్లు-

తాజ్ మహల్ కొనడానికి అడ్వాన్సు యిచ్చినట్లు-

కనిపించాడు-!

అందుకే భార్యను 10 వేల కట్నం కోసం వేధిస్తున్నాడు.




ఆ రోజు

తల్లి సహాయ సహకారాలతో భార్యను తాళ్ళతో కదలకుండా కట్టేశాడు. అలా ఎందుకు కట్టేశాడో అర్థం అయిపోయింది భార్యకు. 'నన్ను చంపొద్దని' ఏడ్చింది. ఆమె కడుపులో ఊపిరి పోసుకుంటున్న బిడ్డ మాత్రం ఏడవలేక, బైట ఏం జరుగుతున్నదో అర్థంకాక తల్లి పేగు పట్టుకొని ఆడుకుంటోంది.

తల్లి మాత్రం బ్రతకాలనే ఆశపట్టుకొని ప్రేలాడుతూంది.

"ఏమిట్రా ఆలస్యం, కానివ్" అత్త తొందర!

భర్త... కిరసనాయిలు డబ్బా అందుకున్నాడు-

కిరసనాయిలు గడ్డ కట్టేటట్లు భార్య అరిచింది. చావు భయంతో... మరోసారి అరవకుండా చీర చించి ఆమె నోట్లో కుక్కింది అత్త.

పాపం-

బిడ్డ పుడితే... ఆ బిడ్డకు ఊయలగా కట్టుకుందామని దాచుకున్న చీరె అది.

ఊయలగా మార్చి బిడ్డ ఏడుపును ఆపాలనుకున్న చీరెతో తన ఏడుపును ఆపారు.

కిరసనాయిలు డబ్బా మూత తీశాడు "భర్త".

* * * *

ఊరి చివర వీధి పంపు దగ్గర రిక్షా రంగడు రిక్షా ఆపాడు. తన చేతిలోని సబ్బును మరోసారి చూసుకున్నాడు. వాసన పీల్చాడు. పది రోజుల క్రితం సినిమాకెళ్తే అటువంటి సబ్బుతోనే ఒక సినిమా తార స్నానం చేయడం చూపించారు. పైగా ఆమె అందానికి కారణం ఆ సబ్బే అని చెప్పారు.

ఆ రాత్రి రిక్షాలో పడుకున్నప్పుడు ఓ కల వచ్చింది - తను ఆ సినిమా తారను పెళ్ళి చేసుకున్నాడు. తన ప్రేమ చిహ్నంగా ఆమె రంగడ్ని దగ్గరకు తీసుకుని ఖరీదైన కారులో వూరంతా తిప్పి "మావా! ఎంత కాలం నీవు ఇండియాలో రిక్షా తొక్కుతావ్...ఎంచక్కా అమెరికా వెళ్ళి రిక్షా తొక్కుకో... ఇదిగో పాసుపోర్టు" అన్నది.

సరిగ్గా పాసుపోర్టు అందుకొనే సమయంలో ఒంటి మీద లాఠీ దెబ్బ పడింది. అప్పుడు గాని తనకు కలొచ్చిందని, తనను కొట్టిందని బీటు కానిస్టేబులని అర్థం కాలేదు" ఆ రాత్రి మాత్రం అతనొక శపథం చేశాడు_ కనీసం ఆ హీరోయిన్ వాడిన సబ్బయినా వాడి తీరతాను అని! అందుకే ఈ రోజు సబ్బు కొన్నాడు.


తెలుగు గంగ నీళ్ళు మద్రాసులో తాగిన ఆంధ్రుడిలా ఎంతో గర్వంతో సబ్బుకు వున్న కాగితం విప్పాడు.

* * * *

అందమైన బొచ్చుకుక్క పిల్ల. ఊలుతో అల్లిన బంతిలా దొర్లుతూ సర్కారు రోడ్డు మీద వెళ్తోంది. ఆ కుక్క ఎస్.పి. గారి రెండో భార్యది. ఆమెకు కుక్కలంటే చాలా మోజు. ఎస్.పి.కి రెండో భార్య అంటే మరీమోజు.

రెండో భార్యమాత్రం రాత్రి పూట ఎస్.పి. గారు విడిచిన కాకీ డ్రెస్సు వేసుకొని పోలీసులు దొంగను హింసించినట్టు ఎస్.పి.గారిని హింసిస్తుంది. ఆ హింసకు కారణం కానిస్టేబుల్ భద్రయ్య. భద్రయ్య చేసిన నేరం ఏమిటంటే అమ్మగారు పెంచే కుక్కలను సరిగ్గా చూడడం లేదు- అంతే.

భద్రయ్యకు మాత్రం కుక్కలంటే పరమ అసహ్యం. దానికి కారణం ఒకటే-వాళ్ళ అమ్మను పిచ్చి కుక్క కరిచి ఆమె చావుకు కారణమయింది.





కాని భార్యగారి కుక్కలను చూడడం కోసమే ఎస్.పి.గారు తనకు యింట్లో డ్యూటీ వేశారు. కుక్కలకు స్నానం చేయించడం - విరేచనం కాకపోతే రాని కన్నీళ్ళు తెప్పించుకుని ఎస్.పి. గారి భార్య చూసేటట్లు ఏడవడం - మొగ కుక్కలకు సెక్సు ప్రాబ్లెం వస్తే పెద్ద లెవెల్ కుటుంబాల్లో ఆడ కుక్కల కోసం వెదకడం-ఇవే కాక డ్రెస్ వేసుకుని భద్రయ్య చెయ్యాల్సిన పనులు.

ఈ రోజు...

ఎస్.పి.గారి రెండో భార్యగారి ముద్దుల బొచ్చు కుక్క పిల్ల- అచ్చు ఎస్.పి. గారి పోలికల్లో వుంటోందని ఆమె గారు ముద్దులాడే కుక్కపిల్ల... సరదాగా రోడ్డెక్కింది. అందుకు భద్రయ్య నిర్లక్ష్యమే కారణం అని పోలీసులకు రాని బూతులు, ప్రక్క రాష్ట్రం పోలీసుల నుండి కూడా అప్పు తెచ్చుకుని ఆవిడగారు భద్రయ్యను తిట్టేశారు. అంచేత ఆ కుక్క పిల్లను పట్టుకోవడానికి భద్రయ్య సైకిలు మీద వెంబడించాడు.

వెధవది. ఆ కుక్కపిల్ల భద్రయ్యను కుక్క అవస్థలు పెడుతోంది. "ఎదవ ముండాఖానా... కడుపున పుట్టిన కొడుకు పారిపోయిన రోజున యింత వర్రీకాలేదు. ఆగవే నిన్ను లాకప్‌లోపంప, 'కుక్కలట్టుకుంటే తల పగిలి సత్తావనే' వోరన్నా మునీశ్వరుడు అమ్మగారికి శాపం ఎడితే బావుండు. మా తల్లి స్నానం సేత్తున్నప్పుడు ఈపు తోవించు కోవడం తప్ప అన్నీ సేయిత్తున్నది. ఎస్.పి. గారి రెండో పెళ్ళాం కాకపోతే ఇది సారా కొట్టుముందు సీకులు అమ్ముకోడానిక్కూడా పనికిరాదు!"

చెమటలు కారుతున్నాయి. వంట్లో ఓపిక, కుక్క పిల్లను, అమ్మగారిని తిట్టడానికి బూతులు లయి పోయినాయి భద్రయ్యకు.

'ఇజ్జు ఇజ్జు' అని పిలుస్తుంటే పోలీసు ప్రేమను అనుభవించడానికి వీధి కుక్కలు, ఊర కుక్కలు వెంట పడ్డాయి గాని అమ్మగారి బొచ్చుకుక్క పిల్ల మాత్రం రాలేదు.

భద్రయ్యకు మాత్రం దాని ఒంటి మీద కిరసనాయిలు పోసి తగలబెట్టేంత కోపం వచ్చింది.

* * *

కిరసనాయిలు డబ్బా మూత తీశాడు భర్త.

కోడలు పూర్తిగా తగలబడి బూడిదయితే కొత్తగా వచ్చే కోడలు జుత్తు యిస్తానని వెంకన్నకు మొక్కింది అత్త.

తలంబ్రాలు పోసిన తల మీద కిరసనాయిలు పోశాడు భర్త.

పసుపు వాసన కొడుతున్న తాళి కిరసనాయిలు వాసనతో గుప్పుమంది.

ప్రపంచంలో ఎన్ని భాషలున్నాయో అన్ని భాషల్లో 'నన్ను చంపద్దు నన్ను చంపద్దు' అని భార్య కన్నీళ్ళు అరుస్తున్నాయి.

ఆమె పూర్తిగా కిరోసిన్‌లో తడిసింది.

ఫ్యాక్టరీకి రిబ్బను కత్తిరించి ప్రారంభోత్సవం చేసి జాతికి అంకితం చేసే మంత్రిలా, ఆమె కాలిమెట్టెలు తీసి, కోడలు శవాన్ని తగలెట్టి ఆ బూడిదను స్త్రీ జాతికి అంకితం చెయ్యి అన్నట్టు చూసింది అత్త.





భర్త: అగ్గిపెట్టె తెచ్చాడు.

ఆమె: పెనుగులాడుతోంది.

అత్త: కొడుకును తొందర చేస్తోంది.

భార్య: గుండెల శబ్దం... కన్నీళ్ళ శబ్దంలా వుంది

భర్త: అగ్గిపెట్టె తెరిచాడు.

వెర్రికేక వేశాడు.

* * * *

రిక్షా రంగన్న సబ్బును మరోసారి చూశాడు. వొంటికి రుద్దుకున్నాడు. సినీ తారలా ఓ పాట పాడుకున్నాడు. మరోసారి సినిమా గుర్తు తెచ్చుకొని ఆ తార ఎలా రుద్దుకుందో అలావే పాదాలు... కాళ్ళు భుజాలు... సబ్బుతో రుద్దు కున్నాడు. దేశం సమస్యలతో నిండి పోయినట్టు ఒళ్ళంతా మరగతో నిండి పోయింది. సబ్బును సుతారంగా సంపుగట్టు మీద పెట్టాడు.

* * * *

భద్రయ్యకు బొచ్చు కుక్క పిల్ల యింకా దొరకలేదు.

"బొచ్చు కుక్క పిల్ల దొరికితే నా కాకీ బట్టలు నీ హుండీలో వేస్తాను స్వామీ...

"అలాగే ఎస్.పి.గారి రెండో భార్య పక్కింటి ఎమ్మెల్యే బామ్మర్దితో లేచిపోతే నీ కొండ కొచ్చి గుండు చేయించుకుంటా స్వామి" మొక్కు కుని నాలుక కొరుకున్నాడు.

మొదటి మొక్కుకు ఇబ్బంది లేదు గాని, రెండో దానికే ఇబ్బంది.

దానికి కారణం తనది బట్ట తల.

పిచ్చికేక వేశాడు.

* * *

వెర్రికేక వేశాడు భర్త.

"ఏమిట్రా నాయనా ఏం జరిగింది?"

భర్తలో కంగారు-

"మాట్లాడవేంరా"

భర్తలో ఆందోళన

"త్వరగా అగ్గిపుల్ల వెలిగించి- అబ్బా... కానివ్వరా...!"

ఏడుస్తూ చెప్పాడు భర్త-

"అమ్మా ఈ అగ్గిపెట్టెలో అగ్గి పుల్లలు లేవే"

అత్తగారిలో కంగారు.

"ఒక్క పుల్ల కూడా లేదే అమ్మా"

అత్తగారిలో ఆందోళన

భార్యలో నిన్ను నిట్టూర్పు. చావుకు రెండు క్షణాలైనా దూరమయ్యాననే ఆనందం.

"ఇప్పుడెలాగే అమ్మా? పోనీ బజారెళ్ళి ఓ అగ్గిపెట్టె కొనుక్కొచ్చేదా! చిల్లరివ్వు"


"ఓరి చిల్లర వెధవ! ఈ అవతారంతో, ఈ కంగారులో, ఈ కిరసనాయిల్ గబ్బుతో బైటికెళ్తే అందరూ అనుమానిస్తారు!"

"మరి ఇప్పుడెలా"

"ఇంట్లో ఎక్కడైనా, అగ్గిపుల్ల వుందేమో వెతికి చద్దాం"

వాస్కోడిగామా ఇండియా కోసం ఎంత వెతికాడో తెలియదు గాని, ఇప్పుడు మాత్రం వీళ్ళిద్దరూ అగ్గి పుల్ల కోసం తెగ వెదుకుతున్నారు.

చెత్తబుట్టలో... పాయిఖానాలో... మంచాల మీద... కంచాల దగ్గర... దేవుడి దగ్గర అన్ని చోట్ల



వెదకని చోటంటూ లేకుండా వెదికిన చోటే వెదుకుతున్నారు. ఎంత విచిత్రం!

ప్రాణం విలువ. కనబడని చిన్న అగ్గిపుల్లలో వుంది.

ఎంత అన్యాయం.

ప్రాణం విలువ- కనబడని చిన్న అగ్గిపుల్లలో వుంది.

ఎంత ఘోరం.

ప్రాణం విలువ ప్రాణం లేని అగ్గి పుల్లలో వుంది.

'భగవంతుడా వాళ్ళకు అగ్గిపుల్ల దొరక నివ్వకు' నేను బ్రతకాలి. నా కడుపులో బిడ్డ కోసం బ్రతకాలి. నన్ను బ్రతికిస్తే, నా ప్రాణాలు కాపాడితే నీకేం ఇవ్వగలనుస్వామీ! ఒక్క రాత్రికి నా శరీరం తప్ప. ఒక్క రాత్రికి నా సుఖం తప్ప- ఒక్క




రాత్రికి నేను పతివ్రతగా చావడం తప్ప!' భగవంతుడు ఆమె ప్రార్థన విని ఆశపడ్డాడా???

* * * *

రిక్షా రంగన్న తడి వంటితో పరుగు దీస్తున్నాడు. తన పెళ్ళి సినిమా తారతో రేపవగా, ఆ రాత్రికే రిక్షాలకు గాలికొట్టే వాడితో సినీతార లేచిపోతే ఎంత ఏడుపొస్తుందో— అంతే సైజు ఏడుపుతో పరుగుదీస్తున్నాడు.

కారణం.

గట్టుమీద పెట్టిన సబ్బు బిళ్ళ కాకి ఎత్తుకెళ్తోంది.

ఆకాశంలో కాకి - నేల మీద రంగన్న-

కడుపుకు కూడా తినకుండా కొన్న సబ్బు అది.

షాజహాన్ జీవితంలో ఒకే సారి తాజమహల్ కట్టించాడు.

అదే చివరి సారి

రిక్షా రంగన్న జీవితంలో ఒకే సారి వాసన సబ్బు కొన్నాడు

అదే చివరి సారి.

''ఒసేయ్ కాకి, ఆ సబ్బు యివ్వవే''

కాకికి కాకి భాష తప్ప మరేదీ రాదు. అందుకే సబ్బు యివ్వలేదు. రంగన్న వెంట పరుగు దీస్తున్నాడు.

* * *

భద్రయ్య కూడా కుక్క పిల్లవెంట పరుగు దీస్తున్నాడు.

''ఏమండి బొచ్చుకుక్క పిల్లగారు'' గౌరవంగా పిలుస్తూ

''నీయమ్మ - నీ అక్క - నీ ఆలి...??? వల్లగుండా దొరకండి''

ఏ లారీ క్రిందయినా పడి చావడం మంచిదని లారీ కోసం చూశాడు భద్రయ్య ఆ రోడ్డు మీద.

వారం క్రితమే ఎస్.పి. గారి రెండో భార్య ఆ రోడ్డు మీదొస్తుంటే ఓ లారీ డ్రైవర్ పెంచుకునే కుక్క తన బొచ్చుకుక్క వెంట సహజ ప్రేమలో పడిందట.

అప్పటి నుండి ఆ రోడ్డు మీద లారీ ట్రాఫిక్‌ను ఎస్.పి. గారు ఆపేశారు.

కుక్క పిల్ల... గారు... ఇంకా పరుగు దీస్తున్నారు.

కానిస్టేబుల్ గాడు ఇంకా యింకా పరుగు దీస్తున్నాడు.

* * * *

భర్తకు చెమటలు పడుతున్నాయి. ఇంకా అగ్గి పుల్ల దొరకలేదు. భార్యనోట్లో కుక్కిన గుడ్డ బైట కొస్తోంది.

''దొరికిందా'' అత్తగారు

''దొరక లేదు'' కొడుకు గారు.

''ఏమండీ నన్ను చంపకండి నేను వెళ్ళి పోతాను. మీరు రెండో పెళ్ళి చేసుకోండి''

అత్త కాలితో తన్నింది.

'అమ్మా' అని ఆమె అరవలేదు. తనకీ కష్టాలకు కారణం తన తల్లి తనకు జన్మనివ్వడమే గాబట్టి - ఆమె అమ్మా అనలేదు.

''దొరికిందా''

''దొరకలేదు''

సబ్బు బిళ్ళతో కాకి ఎగురుకుంటూ ఆ డాబా ఇంటి పెరటిలో వున్న వేప చెట్టు మీద వాలింది.

రంగన్న దొడ్డి గోడ దగ్గర కాకి ముక్కు వైపు చూస్తూ నిలబడ్డాడు. కాకికి సబ్బు అంత రుచి కరంగా లేదు. అందుకే వదిలేసింది. క్రింద పడ్డ సబ్బు కోసం... రిక్షా రంగన్న దొడ్డి గోడ దూకాడు.

బొచ్చు కుక్క పిల్ల ఆ డాబా ఇంటి గేటు గుండా లోపలకు వచ్చింది.

కానిస్టేబుల్ భద్రయ్య నెమ్మదిగా లోపలకు వచ్చి గేటు మూశాడు.

అలసి పోయిన కుక్క పిల్ల... దొడ్లో నీళ్ళు తాగుతోంది.

ఇదే సమయం అనుకున్నాడు భద్రయ్య.

కానిస్టేబుల్ని చూసిన రంగన్న ఒణికి పోతున్నాడు భయంతో...

అమ్మగారు పంపిన సి.ఐ.డి.నేమోనని రంగన్నను చూసి నీళ్ళు మింగుతున్నాడు భద్రయ్య.

ఇంతలో...

''దొరికింది'' భర్త కేక

భర్త చేతిలో అగ్గిపుల్ల.

అత్త ఛాతీలో ఆనందం.

దొరికిన అగ్గి పుల్లను చూసి భార్య భోరుమంది.

అగ్గిపుల్ల వెలిగింది.

భార్య ఏడుస్తోంది.

అగ్గిపుల్ల మంట దగ్గర కొస్తోంది.

భార్య ఏడుస్తోంది.

ఆ ఏడుపులు... కేకలు... అరుపులు... ఆర్త నాదాలు విన్నరంగన్న భద్రయ్యలు కిటికీ తెరచి




లోపల దృశ్యం చూశారు.

చీరె అంటించబోతున్న భర్తను చూశారు.

ప్రాణం లేని అగ్గిపుల్ల చేస్తున్న అరాచకం—

ప్రాణం వున్న మనిషి చేస్తున్న దుర్మార్గం చూశారు.

సబ్బు బిళ్ళ కన్నా... కుక్క పిల్ల కన్నా... ఆ తల్లే ఎక్కువ.

ప్రాణం లేని సబ్బు బిళ్ళ, ప్రాణం వున్నా నోరు లేని కుక్క పిల్ల, చట్టాలు కాపాడ లేని - సంస్కరణ ఆదుకోలేని - పోలీసులు అరికట్టలేని

ఓ అరాచకాన్ని అడ్డుకోవడానికి సాయపడ్డాయి అన్న నిజం నవ్వు పుట్టించేదే అయినా సిగ్గును కలిగించేది.

వెలుగుతున్న అగ్గిపుల్లను ఆర్పాడు రంగన్న.

కట్టిన కట్టలను విప్పాడు భద్రయ్య.

అరవబోయిన అత్తను కరిచింది కుక్క పిల్ల

ముందుకు రాబోయిన భర్తను జార్చి పడేసింది సబ్బు బిళ్ళ.

'నా బ్రతుకింతేనా' అని ఏడ్చింది సగం కాలిన అగ్గిపుల్ల'. ●

(కార్టూన్లు: శ్యాంమోహన్)